ప్రజాశక్తి
మంగళవారం 05 మార్చి 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు సిహెచ్.బాబూరావు, డి.కాశీనాథ్, మున్సిపల్ కార్మికులు

సంక్షేమ పథకాల కొనసాగింపుపై హామీని నిలబెట్టుకోవాలి

- మున్సిపల్ కార్మికుల నిరసనలో సిపిఎం, సిఐటియు నేతలు బాబూరావు, కాశీనాథ్
- స్పందనలో కలెక్టర్‌కు అర్జీ

ప్రజాశక్తి - విజయవాడ : సంక్షేమ పథకాలు, నవరత్నాలు గురించి గొప్పగా చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం పేద మున్సిపల్ కార్మికుల పట్ల వివక్ష చూపుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ విమర్శించారు. ఇటీవల జరిగిన 16 రోజుల సమ్మె సమయంలో సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం నగరంలోని కలెక్టరేట్లో జరిగిన స్పందనలో కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం అందించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. సంక్షేమ పథకాలు రద్దయిన కార్మికుల పేర్లు, పథకాల వివరాలతో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికులకు సిపిఎం, సిఐటియు నేతలు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బాబూరావు, కాశీనాథ్ మాట్లాడుతూ పారిశుధ్య, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న మహిళా, ఇతర కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను రద్దుచేసి ఆర్థికంగా దెబ్బతీసిందని విమర్శించారు. ఓవైపు ప్రభుత్వం వారిని పర్మినెంట్ చేయకుండా మరోవైపు మున్సిపల్ ఉద్యోగులనే పేరుతో పథకాలకు అర్హులు కాకుండా తొలగిస్తోందని విమర్శించారు. ఎప్పటి నుండో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందుతున్న వికలాంగుల పెన్షన్లను కూడా తొలగిస్తోందన్నారు. పిల్లలకు అమ్మఒడి, వితంతు పెన్షన్లు, చేయూత తదితర పథకాల లబ్ధినీ నిలిపివేసిందన్నారు. విద్యా దీవెన నిలిచిపోయటంతో మున్సిపల్ కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోందన్నారు. పిల్లల పేర్లను రేషన్ కార్డుల్లో నమోదుకు నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో యూనియన్ నేతలు టి.ప్రవీణ్, సాంబులు, దాసు, నరేంద్ర పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులివ్వండి మహాప్రభో!

- రైతుల వేడుకోలు
- 15,366 మందికి రూ.302 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఆర్‌బికెల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత 40 రోజులుగా ఒక్క రైతు ఖాతాలోనూ నగదు జమ చేయలేదు. దీంతో రబీ అపరాల తీత, నూర్పిడి పనులు చేసిన కార్మికులకు, యంత్రాలకు నగదు చెల్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తమకు రావాల్సిన డబ్బులు చెల్లించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

కంకిపాడు మండలం మద్దూరుకు గ్రామానికి చెందిన ఎ మోహనరావు ఫిబ్రవరి 10న ధాన్యం విక్రయించారు. రూ.52,392 నగదు ఖాతాలో జమవ్వాలి. బందరు మండలం మాచవరంకు చెందిన ఎం.నారాయణ జనవరిలోనే ధాన్యం విక్రయించారు. ఆయనకు లక్ష రూపాయలకుపైగా నగదు ఖాతాలో జమ కావాల్సి ఉంది. నెల రోజులైనా ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో సోమవారం జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిస్థితి ఈ ఇద్దరు రైతులదేకాదు. ఈ ఏడాది జనవరి 19వ తేదీ తర్వాత జిల్లాలోని ఆర్‌బికెల ద్వారా ధాన్యం విక్రయించిన ఏ ఒక్క రైతు ఖాతాలోనూ నగదు జమ కాలేదు. 15,366 మంది రైతులకు రూ.302 కోట్లు నగదు చెల్లించాల్సి ఉంది. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (నవంబర్ 15 నుంచి ఇప్పటి వరకు) జిల్లాలో 55,273 మంది రైతులు ఆర్‌బికెల ద్వారా 4,84,729.760 టన్నుల ధాన్యం విక్రయించారు. దీనికిగాను రూ.1061.60 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. జనవరి 19వ తేదీకి ముందు ధాన్యం విక్రయించిన 39,907 మంది రైతుల ఖాతాల్లో రూ.759.60 కోట్లు జమయ్యాయి. జనవరి 19వ తేదీ తర్వాత విక్రయించిన రైతులకు 40 రోజులుగా నగదు (మిగతా 6లో)

బకాయిలు చెల్లించకుంటే ఆందోళన

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు

ధాన్యం నగదు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపైన సివిల్ సప్లయ్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఎపి రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 22న ధర్నా నిర్వహించాం. మార్చి రెండో తేదీలోపు నగదు జమ చేస్తామని అధికారులు ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వం వెంటనే ధాన్యం రైతులకు బకాయిలు చెల్లించకుంటే రైతులు, కౌలు రైతులతో కలిసి ఆందోళన చేపడతాం.

6న జాతీయ మానవ హక్కుల కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : మానవ హక్కుల ఉల్లంఘన కేసులను విచారించేందుకు ఈనెల 6న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ మిశ్రా నేతత్వంలోని బృందం విజయవాడలో పర్యటించనుంది. ఇందుకుగాను నగరంలోని లబ్బీపేట పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, సబ్ కలెక్టర్ బీహెచ్. భవానీ శంకర్ పరిశీలించారు. ఈ బృందంలో కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ అరుణ్ మిశ్రాతోపాటు సభ్యులు డిఎం.ములే, రాజీవ్ జైన్, విజయభారతి సయాని ఉంటారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 నుండి 12.30 గంటల వరకు క్యాంప్ సిట్టింగ్‌లో కేసుల బహిరంగ విచారణ, మధ్యాహ్నం 12.30 నుండి 01.30 గంటల వరకు రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశం, 2.30 నుండి 3.30 గంటల వరకు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ పౌర సమాజ సంస్థలు (సిఎస్‌వోలు), స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ (హెచ్‌ఆర్‌డీ) లతో ముఖాముఖి, 3.30 నుండి 4 గంటల వరకు పాత్రికేయుల సమావేశం ఉంటాయి.

దోష రహితంగా ఆధార్ సేవలు

జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కొడాలి అనురాధ

ప్రజాశక్తి - విజయవాడ : సచివాలయాల ద్వారా ఆధార్ మంజూరుకు స్పష్టమైన, దోష రహిత సమాచారం పొందుపరచడంలో ప్రతి ఉద్యోగి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గ్రామ, వార్డు సచివాలయ విభాగ కార్యదర్శి కొడాలి అనురాధ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలలో అందిస్తున్న ఆధార్ సేవలు మరింత నాణ్యతగా అందించేందుకు జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు నగరంలోని ఐవీ ప్యాలెస్‌లో సోమవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అనురాధ మాట్లాడుతూ వ్యక్తుల పేర్లు, చిరునామా, ఫోన్ నెంబరు, చిరునామా మార్పు, నవజాత శిశువులకు ఆధార్ కార్డు ఇచ్చే సమయాల్లో తప్పిదాలు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. శిక్షణ అధికారి జి.గిరిధర్ మాట్లాడుతూ ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, కొత్త కార్డు డౌన్లోడ్ చేసుకునే విధానం, పౌరుల వ్యక్తిగత సమాచార భద్రత వంటి విషయాలలో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలన్నారు. జిఎస్‌డబ్ల్యుఎస్ ఆధార్ స్టేట్ కోఆర్డినేటర్ వి.సుందరం, ఏపీ ఆన్లైన్ జిల్లా కోఆర్డినేటర్ వై.వి.సురేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

మాట్లాడుతున్న కొడాలి అనురాధ

వస్తువుల నాణ్యతపై అవగాహన అవసరం

జడ్‌పి సిఇఒ జ్యోతిబసు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నాణ్యతా ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించి నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేయడంతోపాటు నాణ్యత లేని వస్తువులు కొనుగోలు చేయడం వల్ల ఎదురయ్యే మోసాలను నివారించేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డిపిఆర్‌సి ప్రిన్సిపాల్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు అన్నారు. నగరంలోని బందర్ రోడ్డులో గల డిస్ట్రిక్ట్ పంచాయితీ రిసోర్సు సెంటర్ (డిపిఆర్‌సి) మీటింగ్ హాల్లో నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అంశంపై జిల్లాకు చెందిన సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి సంబంధించి ఎలక్ట్రికల్ వస్తువులు, ఐరన్, సిమెంట్ తదితర వస్తువులను ఐస్ఐ మార్క్ కలిగిన వాటిని మాత్రమే పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. వస్తువుల నాణ్యత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవర్క్‌షాప్ లో ఏపీఎస్ఐఆర్డీ జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్, ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ జ్యోతిబసు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకర్లు కావలెను
ఉద్యోగ అవకాశాలు
ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.
విద్యార్హత: ఇంటర్, ఆ పైన..
విలేకరులు కావాల్సిన కేంద్రాలు:
ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు
కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ
ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..
ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు
:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి
సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

ఎన్‌టిటిపిఎస్‌లో జాతీయ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిటిపిఎస్‌లో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా భద్రత వారోత్సవాలను చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అత్యంత అప్రమత్తంగా ఉండి ప్రతిష్ఠితమైన భద్రతా సూచనలను, సలహాలను పాటిస్తూ ఆస్తినష్టం, ప్రాణనష్టం జరుగకుండా మన సంస్థ ప్రగతి పథంలో పయనించటానికి పాటుపడదామన్నారు. భద్రత అనేది మన జీవన విధానంలో ఒక భాగం కావాలి, ప్రారిశ్రామిక ప్రమాదాల్లో 85 శాతం ప్రమాదకర చర్యల ద్వారానే జరుగుతున్నాయని చెప్పారు. మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయి. నిర్లక్ష్యం వనికిరాదు, ఏకాగ్రతతో పనిచేయాలి. కాంట్రాక్టు కార్మికులు పనిచేసే చోట పర్యవేక్షకులను తప్పనిసరిగా నియమించాలని అన్నారు. పర్యవేక్షక ఇంజినీర్ బొగ్గు సంభాళింపు విభాగం భాస్కర్‌రావు, కర్మాగారాల మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బొగ్గు సంభాళింపు విభాగంలో పనిచేస్తున్నవారు బొగ్గుదుమ్ములో ఎక్కువగా ఉండవలసి వస్తుందన్నారు. అందువల్ల తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. యూనిఫామ్ ధరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు కె.వి.రాజారావు, వాసుదేవరావు, తిరుమలప్రసాద్, జవహర్, అనురాధ, ఇ.ప్రసాద్, రమణమూర్తి, సురేష్‌బాబు, వెంకటరావు, సేఫ్టీ ఆఫీసర్ ఇంజినీర్లు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నవీన్ గౌతమ్

గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : ఎంపి ల్యాడ్స్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో డొంక రోడ్డుకు గ్రావెల్ ఏర్పాటు పనులు చేస్తున్నట్లు నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ మండలంలోని కంచల గ్రామంలో ఎంపి (కనకమేడల రవీంద్ర కుమార్) ల్యాడ్స్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో కంచల నుండి కేతవీరునిపాడు వరకు డొంక రోడ్డుకు గ్రావెల్ ఏర్పాటు పనులకు నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి 90శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నెలకుదిటి శివ నగేశ్వరరావు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ఉదయ రాణి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని జిల్లా చీఫ్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ ఉదయ రాణి సోమవారం అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వేద ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ వసంతకు అభినందనలు

ప్రజాశక్తి - నందిగామ : వైసిపిని వీడి టిడిపిలోకి విచ్చేసిన మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌ని సోమవారం నందిగామ టిడిపి నాయకులు కలిశారు. టిడిపి సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త నర్సనేని మురళి, టిడిపి సీనియర్ నాయకులు కోవెలమూడి సురేష్, చందర్లపాడు మండల సీనియర్ నాయకులు కొత్త శ్రీరామ్ మూర్తి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఈవూరి వినోద్, వ్యాపారవేత్త కొమ్మి దుర్గాప్రసాద్, టిడిపి యువత నాయకులు వేజండ్ల వంశీ, వడ్లమూడి నరేష్, మురళి యూత్ సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

హిందీ ప్రశ్నాపత్రంపై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : హిందీ భాషలో వ్యాకరణాంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సాధించడం చాలా సులభమని దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రథమ శ్రేణి ప్రచారక్ రేపాక రఘు నందన్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జ్ఞానగౌతమ్ కోచింగ్ సెంటర్లో పదో తరగతి విద్యార్థులకు హిందీ ప్రశ్నపత్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హిందీ భాషా పరిజ్ఞానం, సులభ రీతిలో పరీక్ష రాసే విధానాలను రఘునందన్ విద్యార్థులకు వివరించారు. వ్యాకరణాంశాలపై వారికున్న ఉన్న సందేహాలను కూడా నివృత్తి చేశారు. విద్యార్థులు తరచుగా చేసే తప్పులను సరిదిద్దుకోవటం ద్వారా హిందీ సబ్జెక్టుపై ఉన్న భయం తొలగించుకోవాలని, మోడల్ పేపర్ ప్రకారం సాధన చేసి మార్కుల స్కోర్ పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను ప్రిపేర్ చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రఘునందన్

ఆర్‌బిఎస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి అనుబంధ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా జగ్గయ్యపేటకు చెందిన రాచారి విజయలక్ష్మి సోమవారం నియమితులయ్యారు. మచిలీపట్నంలోని వైష్ణవి ది గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ, రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవస్థాపకులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు (బుజ్జయ్య), రాష్ట్ర అధ్యక్షులు వేమూరి రామకష్ణారావు, యనమంట సురేష్ నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరి హనుమంతరావు, ఎఆర్‌కె.మూర్తి, కోర్ కమిటీ సభ్యులు ప్రకాష్ నందిరాజు, నందిగామ నియోజక వర్గ అధ్యక్షురాలు కల్పన నందిరాజు, యువజన అధ్యక్షుడు రాజ హనుమంతు రావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్ళ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం దాములూరు గ్రామంలో సోమవారం కూడలి తిరునాళ్ళ ప్రదేశాన్ని నందిగామ సిఐ హనీష్ సోమవారం ఉదయం పరిశీలించారు. ఉదయం సిఐ హనీష్ కూడలి దాములూరు వెళ్లి అక్కడ మహాశివరాత్రి సందర్భంగా వెహికల్ పార్కింగ్, దుకాణాలు ఏర్పాటు పరిశీలించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఉండాలని ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, ఇఒ వాసిరెడ్డి భూపాల్‌తో మాట్లాడారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా పోలీస్ సిబ్బందికి తెలపాలని ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు బ్యానర్లు కట్టకూడదని తెలిపారు. చట్టానికి వ్యతిరేకమైన పనులు చేస్తే కఠినపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

కూడెల్లి తిరునాళ్ళ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిఐ రవికిరణ్

పారిశుద్ధ్య కార్మికుల విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - నందిగామ : మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచిన సందర్భంగా సోమవారం సాయంత్రం నందిగామ మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా 16 రోజులు పాటు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వంపై పోరాడి వేతనాలు సాధించుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీన మున్సిపల్ కార్మికులకు 21 వేలు జీతం చేస్తూ జీవో నెంబర్ 36ను విడుదల చేసిందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ ఖాసిం పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు సలికేట్ నరేష్, డి.సైదా, పుట్ట మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - నందిగామ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నందిగామ పట్టణ పరిధిలో ఎసిపి రవికిరణ్ ఆధ్వర్యంలో సాయుధ పోలీస్ బలగాలు సోమవారం సాయంత్రం నందిగామ పట్టణ పురవీధులలో, గాంధీ సెంటర్‌లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి రవి కిరణ్ మాట్లాడుతూ నందిగామ సబ్ డివిజన్ పరిధిలో 8 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలు అయిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక బందోబస్తు నిఘా ఏర్పాటుతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ సిఐ హనీష్, ఎస్సైలు పండు దొర, ఉమా దుర్గ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పోలీస్ సిబ్బంది సాయుధ బలగాల అధికారులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** మండలంలోని వేదాద్రి, బండిపాలెం, గౌరవరం గ్రామాల్లో సోమవారం చిల్లకల్లు పోలీసులు కవాతు నిర్వహించారు. విజయవాడ సిపి క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు, రూరల్ డిసిపి కె.శ్రీనివాసరావు, నందిగామ ఎసిపి డాక్టర్ రవి కిరణ్ సారథ్యంలో, జగ్గయ్యపేట సిఐ ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని వేదాద్రి, బండిపాలెం, గౌరవరం గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, వి.సతీష్, పి.రాంబాబు, బి.అభిమన్యు పోలీసు సిబ్బందితో ఎలక్షన్‌లో స్వచ్ఛందంగా ఓటు వినియోగించుకునేందుకు ప్రజలలో ధైర్యాన్ని నింపే ఉద్దేశ్యంతో పోలీసు కవాతు ప్రధాన వీధులలో నిర్వహించారు.

నందిగామ

జగ్గయ్యపేట

65 మందికి జైలు, జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక 5వ ట్రాఫిక్ పోలీసు వారు 65 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని సంబంధిత ఏడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఎనిమిదో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం ప్రవేశపెట్టారు. న్యాయమూర్తులు కె.సురేష్ బాబు, విజయ్ కుమార్ రెడ్డి, వాహనదారులకు జైలు, జరిమానా విధించారు. ఒక వ్యక్తికి 05 రోజులు జైలు, రూ.10,000 జరిమానా, ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి 4 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి 3 రోజులు జైలు, రూ.10వేలు, ఆరుగురికి ఒక్కొక్కరికి 2 రోజులు జైలు, రూ.10వేలు, 24 మందికి ఒక్కొక్కరికి 1 రోజు జైలు, రూ.10వేలు చొప్పున జరిమానా, మిగిలిన 26 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

టాలీలో శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: నియోజకవర్గ టిడిపి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో మూడు నెలల నుంచి మైక్రోసాఫ్ట్ ఎడ్యు కేషన్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు 'టాలీ' కోర్సును అందించి, శిక్షణానంతరం వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్ర మంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ అన్సర్, మైక్రోసాఫ్ట్ ప్రతినిధి షేక్ అస్లాం, కంప్యూటర్ టీచర్ రాణి, ఇంతియాజ్, శ్రీనాథ్, బాల, కోటి తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి ప్రచారం

ప్రజాశక్తి - తిరువూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు రాజ్యాధికారం దక్కాలంటే తిరువూరు నియోజకవర్గంలో బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) జెండా విజయకేతనం ఎగురవేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పత్తిపాటి మల్లన్న విజ్ఞప్తి చేశారు. సోమవారం గంపలగూడెం మండలం చింతలనర్వలో తిరువూరు నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కెపోగు వందన్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మల్లన్న ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వందన్ కుమార్ గెలుపును కాంక్షిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యేసుపాదం, కృష్ణవేణి, భవానీ, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పార్టీ కార్యాలయంలో వాలంటీర్స్ వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మైలవరం వైసిపి సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డిగూడెం మండల జడ్‌పిటిసి సభ్యులు పాలంకి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకాలు లబ్దిదారులు అందరికీ అందాలన్నారు. లోటుపాట్లు ప్రభుత్వానికి తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాలగాని తిరుపతి రావు, సర్పంచ్ మల్లాది రాణి, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్ కుమార్ రెడ్డి, బీమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోటారు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని విద్యానగర్ ఆర్వోలైన్‌లో ఫిష్ ఆంధ్రమినీ అవుట్‌లెట్ దగ్గర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం వాటర్ మోటార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సిమ్మసత్తి మల్లి మాట్లాడుతూ జగ్గయ్యపేటలో కూడ ఫిష్ ఆంధ్ర ద్వారా ఉపాధి పొందటానికి ప్రభుత్వం నుండి అర్హత కలిగిన వ్యక్తి దళితుడైన కరిసే మధుకు వచ్చిన సంగతి అందరికీ తెలిసిన విషయమే, కానీ కొందరు ప్రైవేటు వ్యక్తులు అధికారులతో కుమ్మక్కై రకరకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొంత కాలం క్రిందట వాటర్ మోటర్ దొంగిలించబడిందని, ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని శాసన సభ్యులు సామినేని ఉదయభాను దళితుడైన కరిసేమధుకు అండగా ఉండి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన మండల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి విసన్నపేట : స్థానిక నూజివీడు రోడ్‌లో శ్రీ శ్రీ కాలేజీ ఎదురుగా జనసేన మండల పార్టీ కార్యాలయం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రచార కమిటీ సభ్యులు పసుపులేటి నరేష్‌మిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు బొలియశెట్టి శ్రీకాంత్, తిరువూరు సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వాలంటీర్‌గా పనిచేసిన సర్వవరపు మౌనిక జనసేనలో చేరింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు యాసిన్, టిడిపి మండల అధ్యక్షులు మట్టా వేణు, పట్టణ, గ్రామ జనసేన టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యతరగతి వారి కోసం సౌర విద్యుత్ : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

దిగువ, మధ్యతరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం పిఎం సౌర విద్యుత్ పథకం ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో ఏపీసిపిడిసిఎల్ సౌర విద్యుత్ పథకంపై రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దిగువ, మధ్య తరగతి నివాస వినియోగదారులు వారి గృహాలకు తగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కెపాసిటీ ప్రకారం సబ్సిడీ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

అందజేస్తుందన్నారు. సరాసరి నెలవారి విద్యుత్ వినియోగం 150 యూనిట్లు వరకు ఉంటే రెండు కిలోవాట్ల వరకు సోలార్ ప్లాంట్ కోసం 30 నుంచి 60 వేల రూపాయల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే 150 నుంచి 300 లోపు విద్యుత్ వినియోగం యూనిట్లు ఉంటే 2 నుంచి 3 కిలోవాట్ల వరకు 60 నుంచి 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, ఆర్డీవో ఎం.వాణి, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై చర్యలు తీసుకోవాలి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాలు కేటాయించి ఓటర్లను ప్రలోభపెట్టి మోసగించాలని ప్రయత్నిస్తున్నారని అలాంటి వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు జిల్లా కలెక్టరుకు, ప్రధాన ఎన్నికల అధికారికి సోమవారం లేఖ రాసినట్లు ఆ పార్టీ కార్యాలయం తెలిపింది. ఐదు సంవత్సరాల క్రితం వల్లభనేని వంశీ బాపులపాడు మండలంలో 11 వేల మంది ఓటర్లకు నకిలీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ దానిని ఉల్లంఘించారని, ఆ సమయంలో అతనిపై మరియు దానితో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులపై క్రిమినల్ కేసులు, ఫోర్జరీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆ తర్వాత ఆయన పార్టీ మారడంతో ఆ కేసుల నుంచి తప్పించుకోగలిగారని తెలిపారు. ఇప్పుడున్న పార్టీలో కూడా అతను అదే పని చేయడానికి ప్రయత్నిస్తున్నారని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఓటర్లకు నకిలీ ఇంటి పట్టాలు ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'ర్యాంప్'ను సద్వినియోగం చేసుకోవాలి : ప్రసాద్

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్రంలోని మధ్య, చిన్న, సూక్ష్మ తరహా వ్యాపారులను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహకారంతో ప్రవేశపెట్టిన ర్యాంప్ పథకాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆడిటర్ ఎం.ఆర్.ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక ఎంఆర్ ప్రసాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు ర్యాంప్ సర్వే నిర్వహించడం జరుగుతుం దన్నారు. జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు సర్వేలో సంబంధిత గ్రామ, వార్డు సెక్రటరీల వద్ద వ్యాపారులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలని సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): దారి మళ్లించిన నిధులను వెంటనే గ్రామ పంచాయతీలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎపి పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాజిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ బతకాలంటే రాబోయే ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలన్నారు. పంచాయతీల నిధులు, అధికారాలపై గత మూడు సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు, ఆందోళనలు, పోరాటాలు చేసినా సిఎంకు పట్టడంలేదన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హరిస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఒక విధంగా కేంద్ర ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డికి సహకరిస్తుందని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాల్లోని 3.50 కోట్ల మంది గ్రామీణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి

కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచులు

వస్తే పల్లెలు శిథిలమైపోతాయని, స్థానిక ప్రజాప్రతినిధులు అన్యాయమైపోతారని, రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచుల సంఘం ఆధ్యక్షురాలు గోలి వసంతకుమార్, సర్పంచ్‌ల సంఘం గౌరవ సలహాదారులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గల్లా తిమ్మోతి, రాష్ట్ర కార్యదర్శి కాగిత గోపాలరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముప్పనేని రవిప్రసాద్, మండలి ఉదయ భాస్కర్, పంచకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పికి 35 అర్జీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే సదుద్దేశంతో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీఅద్నాన్ నయీమ్ అస్మి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ 35 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకొని, చట్టపరిధిలో విచారణ జరిపి వాటికి అనుగుణంగా త్వరగా పరిష్కారం అందించడమే స్పందన ముఖ్య ఉద్దేశమన్నారు.

సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్‌పి

సిబ్బందికి సత్కారం

సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో అత్యున్నత సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తొలుత ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి శాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి-చల్లపల్లి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రమిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు అమూల్యమని విద్యుత్ శాఖ చల్లపల్లి విద్యుత్ డివిజన్ పులి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల విద్యుత్ శాఖ కార్యాలయంలోఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లైన్ మెన్ దివస్ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో చల్లపల్లి విద్యుత్ కార్యాలయంకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఆపరేషన్) కన్నంరెడ్డి అరవింద్ కుమార్, చల్లపల్లి లైన్ ఇన్ స్పెక్టర్ పల్లికొండ ఎలీషా ప్రసాద్, వక్కలగడ్డ లైన్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ సుభాని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుండి ఉత్తమ అవార్డులు అందుకున్నట్లు వివరించారు.

కాల్వలు, డ్రైన్ల మరమ్మతులు చేపట్టాలి : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రైతులకు మేలు కలిగేలా జిల్లాలో సాగునీటి కాలువలు, డ్రైన్ల నిర్వహణ పనులు సాగునీరు విడుదలకు ముందుగానే చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కమిటీ చైర్మన్ జన్ను రాఘవరావు అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్లోని స్పందన మీటింగ్ హాల్లో జరిగింది. సాగునీటి కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ పూడికతీత పనులు సాగునీటి కాలువలకు నీటి విడుదలకు ముందుగానే చేపట్టడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సభ్యులు కోరారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులకు పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు వచ్చే నెలలో పంపిణీ చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు అందలేదని పలు గ్రామాల్లో రైతులు చెబుతున్నారని, ధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో అందించాలని కోరారు. ఆక్వా రైతులకు కరెంటు సబ్సిడీ ఆగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మైనర్, మీడియం డ్రైన్లలో పూడికతీత పనులు నరేగా ద్వారా చేపట్టేందుకు జిల్లాలో 106 గ్రామాల్లో పనులు గుర్తించడం జరిగిందని, ఈ పనులు రూ.9.73 కోట్లతో చేపట్టేందుకు కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వారం రోజుల్లో రైతులకు డబ్బులు అందేలా చూస్తానన్నారు. జిల్లాలో ఆక్వా రైతుల కరెంటు సబ్సిడీ సంబంధించి 149 పాత కనెక్షన్లకు, 250 కొత్త కనెక్షన్లకు పెండింగ్ ఉందని, సబ్సిడీ చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పట్టపు శ్రీనివాసరావు, శ్రీకాకుళం నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు : డిఆర్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 27 వరకు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు, ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జరుగుతాయని వెల్లడించారు. మచిలీపట్నం, గుడివాడ డివిజన్లలోని ఐదు పరీక్షా కేంద్రాలలో 973 మంది పదో, 8 పరీక్ష కేంద్రాలలో 1,803 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు సవ్యంగా సాగేందుకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యే విధంగా చూడాలని, పరీక్షా కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూములు, మూల్యాంకన కేంద్రాల వద్ద భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తానా, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం.డేవిడ్‌రాజు, సిఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, విద్యుత్ ఏఈ పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు న్యాయవాదుల మరణం తీరనిలోటు : జడ్జి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు యువ న్యాయవాదులు ఆకస్మిక మరణం న్యాయ వ్యవస్థకు తీరని లోటు అని కృష్ణాజిల్లా జడ్జి అరుణ్ సారిక అన్నారు. ఇటీవల మరణించిన మట్టా లోకనాథం, పల్లంపాటి హర్షవర్ధన్ సంతాప సభ జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న వయసులోనే పలు కేసులు వాదించి అందరి మన్ననలను పొందిన ఇద్దరు యువ న్యాయవాదుల మరణం భర్తీ చేయలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొలుసు హరిబాబు, మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, పదో అదనపు జిల్లా జడ్జి వి నరసింహమూర్తి, ఆరో అదనపు జిల్లా జడ్జి చినబాబు పాల్గొన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి మధ్యాహ్నం 12 గంటల వరకు కోర్టు వర్క్‌ను సస్పెండ్ చేశారు.

పారిశ్రామికాభివృద్ధికి ఆద్యుడు వెలగపూడి

ప్రజాశక్తి-ఉయ్యూరు: రాష్ట్రంలో కేసీపీ, ఇతర పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామికాభివృద్ధికి వెలగపూడి రామకృష్ణ బాటలు వేశారని కేసీపీ షుగర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఉయ్యూరు యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ కొనియాడారు. వెలగపూడి రామకృష్ణ 128వ జయంతిని పురస్కరించుకుని సోమవారం కర్మాగార ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా 53వ జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. భద్రతపై

కార్మికులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. 15 మంది కార్మికులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న కార్మికులు, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ హెడ్ వసంతరావు, వ్యవసాయ విభాగ హెడ్ పున్నారావు, డిస్టలరీ డీజీఎం కె చంద్రబాబు, సంపత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఆర్.నరేంద్ర పాల్గొన్నారు.

దిశ ఎసిపిగా ప్రకాష్ బాధ్యతలు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ దిశా ఎసిపిగా ప్రకాష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా గుంటూరు సిసిఎస్‌లో డిఎస్‌పిగా పని చేస్తున్న ప్రకాష్‌బాబు ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్

కమిషనరేట్ దిశా ఎసిపిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాని ఎసిపి ప్రకాష్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మసీదుకు రూ.లక్ష విరాళం

విరాళమిస్తున్న గయాసుద్దీన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక నైజాం గేట్ సెంటర్‌లోని మసీద్ ఇ మొహమ్మది అహలేసున్నత్ వాల్ జమాత్‌కు జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూపు చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా)రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సోమవారం మధ్యాహ్నం మసీదు పెద్దల ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లిన గయాసుద్దీన్ మసీదు అభివృద్ధి కోసం ఈ విరాళాన్ని అందజేశారు. గయాసుద్దీన్ కు ముస్లిం ప్రముఖులు, మత పెద్దలు అభినందనలు తెలిపారు. మంచి మనసుతో సామాజిక సేవా దృక్పథంతో ధార్మిక చింతనతో పనిచేస్తున్న గయాసుద్దీన్ చేపట్టిన కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని వారు ఆయనను అభినందించారు.

41వ డివిజన్‌లో గయాసుద్దీన్ ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అన్ని వర్గాల ప్రజల్లో జనసేన టిడిపి కూటమికి మంచి ప్రజాదరణ లభిస్తుందని జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, ఐజ గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) అన్నారు. సోమవారం ఐజా ప్రజాయాత్రలో భాగంగా 41 డివిజన్‌లోని హరిజనవాడ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గయాసుద్దీన్ మాట్లాడుతూ తనకు పశ్చిమ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీచేసే అవకాశం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజాయాత్రలో పలువురు జనసేన సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

జనసేన కార్యాలయం ప్రారంభం

కుక్కర్లు అందజేస్తున్న పోతిన మహేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గంలో 55వ డివిజన్ అధ్యక్షులు సోమీ గోవింద్ 54, 55 డివిజన్ కమిటీ, సమన్వయకర్తలు సయ్యద్ ముబీనా, ఉప్పల.అజయ్, బొంతు. గంగాధర్, నసీమా, సల్మా, ఆతుకూరి.బాలు, పల్లంటి ఆది ఆధ్వర్యంలో పంజా సెంటర్ 54, 55 డివిజన్‌ల కార్యాలయాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ పశ్చిమ నియోజక వర్గం ఇంచార్జ్, నగర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం 600 మందికి మహిళలకు కుక్కర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కమిటీ, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ సమన్వయ కమిటీ, నగర కమిటీ, అమ్మవారి ధార్మిక సేవ మండలి, కష్ణా పెన్నా రీజినల్ కోఆర్డినేటర్స్, పాల్గొన్నారు.

ప్రజలపై ధరలు, పన్నుల భారాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ధరలు, పన్నులు, ఛార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై జగన్ మోహన్ రెడ్డి రూ.8 లక్షల భారం మోపారని ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెత్త పన్నుతో సహా రకరకాలు పన్నులు వేసి లక్షల కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. 58 నెలల కాలంలో రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చారని. సంక్షేమ పథకాలకు రూ.2 లక్షల కోట్లు పోగా మిగిలిన లక్షల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, పోలవరం, అమరావతి, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు లేవన్నారు.

స్పందనలో 13 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ రవీంద్ర రావు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 13 అర్జీలు వచ్చాయి. నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రరావు అర్జీదారుల వద్ద స్పందన అర్జీలను తీసుకున్నారు. సకాలంలో సమస్యలు పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ -7, పోలీస్ డిపార్ట్మెంట్ -1, సివిల్ సప్లై డిపార్ట్మెంట్ -1, మున్సిపల్ డిపార్ట్మెంట్-1, హౌసింగ్ డిపార్ట్మెంట్ -1, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్-2 అర్జీలు వచ్చాయి. పలువురు అధికారులు పాల్గొన్నారు.

తండాలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - ఎ.కొండూరు : వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నబి తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం మత్రియా తండా పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్ తండాకు చెందిన పమిడిముక్కల జగదీష్ (45)కు అదే తండాకు చెందిన భూక్యా పార్వతితో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహమైన కొంతకాలం వరకు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి సంతానం లేకపోవడంతో ఒక పాపను పెంచుకుంటున్నారు. జగదీష్ వంట పని నిమిత్తం విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లి వారానికి ఒకసారి ఇంటికి వస్తుండేవాడు. మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖలీల్, జగదీష్ మంచి స్నేహితులు కావటం వల్ల ఖలీల్ తరచుగా జగదీష్ ఇంటికి వెళ్తుండేవాడు. దీంతో ఖలీల్ జగదీష్ భార్య భూక్య పార్వతితో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఖలీల్ జగదీష్ సోమవారం తెల్లవారుజామున ఎ.కొండూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలోని ఫారెస్ట్ జామాయిల్ తోటలో మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. తన భార్యతో ఉన్న వివాహేతర సంబంధంపై ఖలీల్‌ను జగదీష్ ప్రశ్నించగా ఖలీల్ బండరాయితో జగదీష్ తలపై కొట్టి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న జగదీష్ అన్న పమిడిముక్కల శివకుమార్ సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే జగదీశ్ మృతిచెందాడు. శివకుమార్ ఎ.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులే సంఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

భవానీపురంలో నాని, ఆసిఫ్ పర్యటన

ప్రచారంలో నాని, ఆసిఫ్, తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 42.డివిజన్.. కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని నాని, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని పర్యటించారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, నేతాజీ స్కూల్ ప్రాంతంలో పర్యటించారు. ముఖ్యమంత్రిగా జగన్‌ను, స్థానిక ఎంఎల్‌ఎగా ఆసిఫ్‌ను గెలిపించాలని కోరారు. పలువురు పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, రాష్ట్రచైర్మన్లు, రాష్ట్ర డైరెక్టర్లు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులు డివిజన్ అధ్యక్షులు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు.

ఎన్‌ఎస్‌పి కాల్వ హద్దులు మార్పు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి - గంపలగూడెం: మధిర ఎన్ఎస్పి కెనాల్ నుండి మేడూరు పెద్ద కొమెర, కొత్తపల్లి ఆర్ మైనర్ కాలువ అలైన్‌మెంట్ హద్దులు మార్చినట్లు పెద్ద కొమెర గ్రామ రైతులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో దివ్వెల నాగేశ్వరరావుకు చెందిన సర్వే నంబర్ 141 3డిలో ఎకరం పొలం ఉండగా, అందులో మరో 60 అడుగుల వెడల్పున సర్వే రాళ్లను ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదు చేశారు. పూర్వం ఎన్ఎస్పీ కాలువకై 60 అడుగుల విస్తీర్ణం మేర తమతో పాటు మరో 20 మంది రైతులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రీ సర్వేలో భాగంగా కాలవ హద్దు అది కాదంటూ రైతుల పొలాల్లో మరో 60 అడుగుల లోపల రాళ్ల వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై స్థానిక సిపిఎం నాయకులు గువ్వల సీతారాంరెడ్డి, మద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానపాటి వెంకటేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహశీల్దార్ డి.సుగుణ వారం రోజుల్లో సరైన సమాచారాన్ని ఇస్తామని వివరించారు. స్పందనలో మరో ఏడు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ చెప్పారు.

టెన్త్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

బహుమతులందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: గత నెల 5న యుటిఎఫ్ ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయిలో పట్టణంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో రెండో బహుమతి అందుకున్న నాగార్జున పబ్లిక్ స్కూల్ పదో తరగతి విద్యార్థి బి.రాహుల్‌కు సోమవారం జెఆర్‌సి విద్యా సంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, కరెస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులందజేశారు. జెఆర్సి కాలేజి ప్రిన్సిపాల్ అబ్బులు, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా సహాధ్యక్షులు మన్నే కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ఈ - టెక్నోలో ఫేర్వెల్ డే

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ నారాయణ ఈ - టెక్నో స్కూల్ లో సోమవారం రాత్రి ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఆట పాటలతో ఘనంగా వీడ్కోలు పలికారు. 10, 9 తరగతి విద్యార్థులు ఆట పాటలతో డాన్సలతో ఉత్సాహంగా సందడి చేశారు. ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఎంతో ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు.

న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సోమవారం నందిగామ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. నందిగామలో నూతనంగా నిర్మించిన సీనియర్ సివిల్ జడ్జ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భవనం ప్రారంభించాలని కోరారు.

లారీ బోల్తా పడి దూడలు మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం : లారీలో లేగదూడలను తరలిస్తుండగా, లారీ అదుపుతప్పి బోల్తాపడటంతో 13 లేగ దూడలు మతి చెందినట్లు స్థానిక ఎస్సై ఎస్ శ్రీను తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువూరు వైపు నుండి వయా గంపలగూడెం- పెనుగొలను, మీదగా ఖమ్మం జిల్లా పోతున్న లారీ ప్రయాణిస్తోంది. ఈ నేపథ్యంలో తునికిపాడు హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మలుపు వద్ద అదుపుతప్పింది. అందులో దాదాపు 40 లేక దూడలు ఉండగా, ఐదింటికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో మిగిలిన దూడలు పలా యనం చెత్తగించినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి తిరు వూరు సిఐ షేక్ అబ్దుల్ నబీ, సిబ్బంది చేరుకున్నారు. స్వల్ప గాయాలైన లారీ డ్రైవర్‌ను, మరో ఇద్దరిని ఒక ఆటోలో మధిర ఆసుపత్రికి చేర్చగా, పోలీసులు వెళ్లే లోపే వారు పారి పోయి నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

ఎపి మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - గంపలగూడెం: స్థానిక ఎపి మోడల్ స్కూల్ (పెద్ద కొమెర) 24-25 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఆంగ్లంలో ఐదో తరగతి స్థాయిలో ఉన్న సిలబస్ నుండి ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలుపుతూ, మార్చి3 తేదీ నుండి 31 వరకు ఆన్లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఒసి, బిసిలు 150 ఎస్సీ, ఎస్టీలు 75 రూపాయల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థినీ-విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అదనపు వివరాలకు పాఠశాల సమయంలో తమను సంప్రదించాలన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఫేర్‌వెల్ డే వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీనిధి పాఠశాలలో ఫేర్వెల్ డే వేడుకలు సోమవారం ఎంతో ఘనంగా జరిగాయి. 9వ తరగతి విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథులుగా వచ్చిన మండల విద్యాశాఖ అధికారి శ్యామ్, ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు రాసే విధానంలో మెళకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ ముత్యాల కిషోర్ బాబు, డైరెక్టర్ రాజయ్య, ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ, హయ్యర్ ఇంచార్జ్ శ్రీనివాస్, ప్రైమరీ ఇంచార్జ్ పద్మావతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాత్రికుల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, ఇంద్రకీలాద్రి కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు యాత్రికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. సోమవారం గుడిలోని పలు ప్రదేశాలను, కౌంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా మహామండపం 2వ అంతస్తులో యాత్రికులకు అన్నదానం జరిగే ప్రదేశం, అన్నదానం, విరాళాలు స్వీకరించు కౌంటరు, ఇతర ప్రదేశాలను తనిఖీ చేశారు. అన్నదానం స్వీకరిస్తున్న యాత్రికులకు అడిగి, దర్శనం, అన్నప్రసాదం ఏర్పాట్ల గురించి వివరాలడిగి తెలుసుకున్నారు. మరిన్ని మెరుగైన సౌకర్యాలు యాత్రికులకు కల్పించాలని సూచించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి, భవానీపురం : 45వ డివిజన్ పరిధిలో ఉన్న ఏకలవ్య నగర్‌లో రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక రోడ్లు పాడైపోయి లోతు తక్కువగా ఉండి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని 45 వ డివిజన్ కార్పొరేటర్ కుమారీ మైలవరపు మాధురీ లావణ్య పశ్చిమ నియోజక వర్గ శాసన సభ సభ్యులు వెలంపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో చర్చించారు. ఈ మేరకు రూ.20 లక్షలతో వైసిపి నాయకులు, మైలవరపు కృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్తా శ్రీనివాస్, సచివాలయం కన్వీనర్లు కోటేశ్వరరావు, కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మర్రెడ్డి శ్రీరాములు నాలుగో వర్ధంతి

మాట్లాడుతున్న పి. చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : శ్రమ పట్టుదల క్రమశిక్షణ కలిగి విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు చేరాలని అప్పుడే విద్యార్థి దశ సార్థకమవుతుందని విజ్ఞాన కేంద్రం చైర్మన్ డాక్టర్ పి చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం అమరజీవి, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన మర్రెడ్డి శ్రీరాములు నాలుగవ వర్ధంతి సభ నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య, మర్రెడ్డి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో డాక్టర్ చంద్రశేఖ రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన పరీక్షల సమయంలో విద్యార్థులలోని భయాన్ని ఆందోళనను పోగొట్టి పరీక్షలను ప్రశాంతంగా రాసే విధంగా బోధన సిబ్బందితో సలహాలు అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. ఉయ్యూరు లోని విజ్ఞాన కేంద్రంలో టైలరింగ్ లో శిక్షణ కంప్యూటర్ శిక్షణ కుట్టు అల్లికలు శిక్షణతో పాటు ఇంగ్లీష్ స్పోకెన్ కోర్స్ అందుబాటులోకి తెస్తామని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి తన వంతు కర్తవ్యం గా ప్రజల్ని చైతన్యవంతులను చేసి నిత్యం ప్రజలలో ఉంటూ మర్రెడ్డి శ్రీరాములు గుర్తింపు తెచ్చుకున్నారని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. విద్యార్థులకు పరీక్ష రాసుకునేందుకు వీలుగా పెన్ను పాడ్‌లను చారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు పివి రమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మర్రెడ్డి శ్రీరాములు కుటుంబ సభ్యులతో పాటు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే శివ నాగేంద్రం ఐద్వా జిల్లా కార్యదర్శి వీరమాచనేని జ్యోతి బాలోత్సవ కమిటీ చైర్మన్ కాగిత గోపాలకష్ణ బి కీర్తి బి రాజేష్ సేలం ప్రకాష్ రావు నమ్మది నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న స్నిగ్ధ

ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలను స్నిగ్ధ సోమవారం పరామర్శించారు. రక్ష ఫౌండేషన్ తరపున ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 20000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రమాద వివరాలను, జరిగిన ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇల్లు లేని పేదలకు స్థలం కేటాయించి, పక్క ఇల్లు నిర్మిం చుకు నేలా ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు

విశ్వభారతి స్కూల్ 56వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ప్రైమరీ పాఠశాల 56వ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విశ్వభారతి స్కూల్ డైరెక్టర్ ఆర్.మంజుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, ప్రిన్సిపల్ రాధ స్కూల్ విషిష్టతను వివరించారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆహ్వానితులను అలరించాయి. 2023-24 వార్షిక చెస్ ఛాంపియన్‌షిప్ గ్రహీతలు జి.యశ్విన్, ఎస్.కె ఆహమ్మద కబీర్, జి.విర్షిత్‌లకు కీర్తి ట్రోఫీలను సంస్థ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మంజుల అందజేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -బంటుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వం మీచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం, ఇన్పుట్ సబ్సిడీని సంక్రాంతిలోపు అందజేస్తామని ఇంతవరకు ఇవ్వలేదని, వెంటనే పరిహారం అందించాలని కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. స్థానిక గుండా బత్తుల ఆంజనేయులు భవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంక దాసుల అజయ గోష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇన్ని రోజులు ఆలస్యం చేయటం అన్యాయమని, ధాన్యం డబ్బులు, నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్దన్ రావు, రైతు సంఘం నాయకులు వెంట్రపాటి శ్యాంసుందర్, జన్యావుల కన్నారావు, దూసనపూడి రాంబాబు, సిఐటియు నాయకులు మాజేటి శ్రీనివాసరావు, వెంట్రపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-చల్లపల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా సంరక్షణ కార్యదర్శి వేమూరి లావణ్య కోరారు. సోమవారం పోషణ అభియాన్ సంబరాల్లో భాగంగా చల్లపల్లిలోని ఎస్.ఆర్.వై.ఎస్.పి హైస్కూలులో బాలికలకు కిషోర వికాసంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఏటా మార్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలికలు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు తీసుకోవలసిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాల వయసు నిండేవరకు వివాహం చేయకూడదని, బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని అన్నారు. బాలికకు 18 సంవత్సరాలు, బాలుడికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం జరుపుతున్నట్లయితే ఆ సమాచారాన్ని వెంటనే స్థానిక సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శికి గాని, అంగన్వాడీ టీచరుకు గాని, పోలీస్ వారికి గానీ లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరుకు గాని సమాచారం అందించాలని కోరారు.

నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: విద్యార్థులు సరైన తర్ఫీదునిస్తే రాష్ట్ర 'స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించగలరని టైగర్పవర్ క్లబ్ విద్యార్థులు నిరూపించారని కోచ్ వర్రె అంజిబాబు తెలిపారు. బాపులపాడు మండలానికి చెందిన టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించడంతో పలువురు అభినందించారు. టైగర్ పవర్ క్లబ్కు చెందిన సందీప్, ప్రభోదయ, వేణు, జస్వంత్, జగదీష్, అభినయ్, రామకిరణ్, రాజేష్, విక్రమ్రాజు, శేఖర్, అలెన్నమ్యూత్ పాల్గొని 9మంది బంగారు పతకాలు, 3 వెండి పతకాలు కైవసం చేసకున్నట్లు కోచ్ అంజిబాబు విరరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను వీడీఎస్ ప్రసాద్, తదితరులు అభినందించారు.

భారీ టిప్పర్ల కారణంగా రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి-చల్లపల్లి : గ్రామీణ రహదారుల వెంట భారీ టిప్పర్లు పరుగులు తీయడంతో రహదారులు చిన్నాభిన్నమై శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామీణ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్ణానది పరివాహక ప్రాంతాలైన లంకపల్లి ,శ్రీకాకుళం, పాపనాశనం ఇసుక రీచ్ నుండి భారీటిప్పర్లు అధిక లోడుతో ప్రధాన గ్రామీణ రహదారులపై రాకపోకలు సాగించడంతో రహదారులలో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. అధ్వానంగా తయారైన రహదారుల వెంట ప్రయాణించేందుకు ద్విచక్ర వాహన దారులు సైతం రహదారులు వెంట ప్రయాణిం చేందుకు భయపడుతున్నారు. చల్లపల్లి మండలం పాగోలులో సోమవారం అధ్వానంగా తయారైన రహదారి గోతిలో టిప్పర్ దిగబడింది. కష్ణానది నుంచి బుసక భారీ లోడుతో తరలిస్తున్న టిప్పర్ పాగోలులో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ సమీపంలో రహదారి మధ్యలో గోతుల్లో టైర్లు కూరుకుపోయి ఆగిపోయింది. దీంతో చల్లపల్లి వైపు నుంచి మోపిదేవి మండలం కే.కొత్తపాలెం మీదుగా కష్ణానది కరకట్ట వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

సిసిరోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని మంటాడ గ్రామాభివద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మంటాడ గ్రామంలో సిసి రోడ్లు ప్రారభించారు. అలాగే డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి 30 లక్షలు నిధులతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నా మని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేదసుప్రజ, వైసిపి నాయకులు ఎలమంచిలి గణేష్, ఏనుగు మస్తాన్ రావు, కంభం రాంబాబు, కోడిబోయిన కోటేశ్వరావు, ఎంపిటీసీ సభ్యురాలు మీరుగలక్ష్మి, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులుగా చింతపల్లి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరుపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటేశ్వరరావును టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కమిటీలో సభ్యులుగా ఎన్ను కున్నారు. ఈసందర్భంగా సోమవారం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు చేతుల మీదగా నియామక పత్రాన్ని అందు కున్నట్లు తెలిపారు. మండలంలోని పలు వురు టిడిపి నాయకులు, కార్యకర్తలు చింతపల్లి వెంకటేశ్వరరావును అభినందించారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : నిబద్ధతతో విధులు నిర్వర్తించి వినయోగదారులు, అధికారుల మన్ననలు పొందాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు సబ్ డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు డి కష్ణనాయక్ సూచించారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సబ్ స్టేషన్ ఆవర ణలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విధినిర్వహణలో అలసత్వం, అజాగ్రత్త ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సత్వర సేవలందించి గుర్తింపు పొందాలన్నారు. విధి నిర్వహణ పట్ల పలు సూచనలుచేశారు. లైన్మేన్ల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కషిచేస్తానన్నారు. డివిజన్లోని ఏడీఈలు, ఏఈలు, లైన్మేన్, జూనియర్ లైన్ మేన్, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈసందర్భంగ ఉత్తమ లైన్మేన్లు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. సబ్ డివిజన్ అధికారులు పి శివనాగేశ్వరరా వు, ఎన్ సుబ్రమణ్యేశ్వరరావు, ఎంవీవీ రామకష్ణ, సిబ్బం ది పాల్గొన్నారు.

జర్మనీ బృందం పర్యటన

ప్రజాశక్తి కోడూరు : మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ నేతృత్వంలో సోమవారం కోడూరు మండల పరిధిలోని ఊట గుండం గ్రామంలో జర్మనీ వాసి గుజ్జుల రవీంద్ర బందం పర్యటించారు. గతంలో నిర్మించిన తుఫాన్ షెల్టర్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలి బుద్ధప్రసాద్ సహకారం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. టిడిపి నాయకులు దేవన బోయిన వెంకటేశ్వరరావు రామకష్ణాపురం గ్రామంలో తుఫాన్ షెల్టర్ నిర్మించాలని జర్మనీ బందాన్ని కోరారు. ఈ విషయంపై స్పందించిన జర్మనీ బందం నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం జర్మనీ బందాన్ని స్థానిక నేతలు దుశ్శాలువాతో సత్కరించారు.

రోడ్డు బాగుచేయాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : గత ఏడు ఎనిమిది సంవత్సరాలుగా బంటుమిల్లిలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి పెందురు 216 హైవే వరకు రోడ్డు గుంతలమయంగా ఉండడం వల్ల చదువుకుంటున్న విద్యార్థులు, బైకులపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు నాయకులు ఎండిఒకు వినతిపత్రం సోమవారం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడూత ప్రయాణీకులు అనేకసార్లు గోతుల్లో పడి ప్రమాదాలు కూడా జరిగాయని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసిన ఇబ్బందులు తొలగించాలని కోరారు. సిఐటియు నాయకులు మాజీటి శ్రీనివాసరావు, పొదలి వెంకన్న, వెంట్రుపాటి రాంబాబు, గౌరిశెట్టి నాగేశ్వరావు, లంకదాసుల అజయ్ గోష్, వంగలరాజు శ్యామలరావు పాల్గొన్నారు.

వేల్పూరులో 'పల్లెబాట'

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రామాలకు వెలుగులు రావాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని వేల్పూరు, కృష్ణాపురం పంచాయతీ నారాయణపురం, ముసలినాయిపాలెంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవినీతిమయం అయిందని అన్నారు. ప్రజా సంక్షేమ విస్మరించిందన్నారు. వేల్పూరు సర్పంచ్ దిలీప్ కుమార్, మాజీ జడ్పిటిసి మోటార్ వెంకటసుబ్బయ్య, జక్క శ్రీనివాసరావు, బోలో లక్ష్మినారాయణ, కొల్లూరు బాబ్జి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

విఎంసి స్పందనలో 12 ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 12 ఫిర్యాదులు రాగా, వీటిలో ఇంజినీరింగ్ 4 ఫిర్యాదులు, ఎస్టేట్ 4, టౌన్ ప్లానింగ్ 1, హార్టికల్చర్-1, ప్రజా ఆరోగ్య శాఖ -1 యుసిడి విభాగానికి చెందిన ఒక ఫిర్యాదు వచ్చింది. ఈకార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ యం ప్రభాకర రావు, అడిషనల్ కమీషనర్(ప్రాజెక్ట్స్) కే సత్యవతి, అడిషనల్ కమీషనర్(జనరల్) ఎ.మహేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అఫ్ హెల్త్ డా. పి.రత్నావళి, డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) సజన, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహ మూర్తి, ఎడిహెచ్ రత్నకొండ రామ్మోహన్, బియోలజిస్ట్ సూర్య నాయక్, ఆర్‌యఫ్‌ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమన్వయానికి కమాండ్ కంట్రోల్ కేంద్రం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

సోమవారం ఆయన...జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ, సోషల్ మీడియా సెల్ విధివిధానాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితరాలపై అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ పటిష్టమైన సమన్వయానికి జిల్లాస్థాయి సమీకత కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య సమన్వయానికి ఇది కీలకంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి సీహెచ్ శైలజ, అడిషనల్ డీసీపీ ఎం.కష్ణమూర్తి నాయుడు, డిప్యూటీ కమిషనర్ (ఐటీ) సవీష్ వర్మ, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొలతల పుస్తకం పోయినది

ఎన్టీఆర్ జిల్లా, తక్కెళ్లపాడు పంచాయతీ సంబంధించిన కొలతల పుస్తకం M. Book 89a/GP/2015-16 పోయినది. ఫిబ్రవరి 24వ తేదీన లింగాలపాడు నుండి నందిగామకు బైక్ పైవస్తుండగా మార్గమధ్యంలో పుస్తకం పోయినది. సదరు కొలతల పుస్తకం దొరికిన వారు 9963658196 సెల్ నెంబర్ కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

సవరణ

ప్రజాశక్తి దినపత్రికలో 3-3-2024 తేదీన ప్రచురించబడిన బుద్ధవరం గ్రామపంచాయతీ టెండరు ప్రకటనలో టెండరు తేది 5-3-2024 సోమవారం అని వచ్చినది. 5-3-2024 తేదీ మంగళవారంగా పరిగణించగలరు.

సం// శ్రీ బి.సత్యబాబు
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ, బుద్ధవరం

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P. No. 45/2023
(In the Matter of Hindu Marriage Act)

Between;
నరహరిశెట్టి లక్ష్మీ పెరుమాళ్ళు @ పెరుమాళ్ళు .... పిటీషనర్
మరియు
నరహరిశెట్టి పద్మ W/o నరహరిశెట్టి లక్ష్మీ పెరుమాళ్ళు D/o పుల్లేటి వెంకటేశ్వరరావు, రాణిగారితోట, విజయవాడ. .... రెస్పాండెంట్

పై నెంబరు ఓ.పి.లో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం ది. 15-3-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 15-3-2024

మచిలీపట్నం ఎ.సత్యనారాయణ
ది.04-03-2024 పిటీషనర్ తరపున న్యాయవాది.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విజయవాడ బ్రాంచి ఆఫీసులు -
-బోడెమ్మ హోటల్ ప్రక్కన, బి ఆర్ పి రోడ్, 1 టౌన్.
-శ్రీ కృష్ణ నిలయం, బ్యాంక్ఆఫ్ బరోడా పైన, ఏలూరు రోడ్డు, గవర్నర్‌పేట.
- జమ్మిచెట్టు సెంటర్, మోడరన్ అకాడమీ కాలేజి ప్రక్కన, మొఘల్‌రాజపురం.
- # 43-144-5, ఫస్ట్‌ఫ్లోర్, పైపులరోడ్డు, రామాలయం గుడి ఎదురు, అజిత్‌సింగ్‌నగర్. ఫోన్ : 9121591614

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-03-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 763.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
VIJAYAWADA AREA CELL NO- 80088 12798

కన్నెవీడు గ్రామపంచాయతీ

టెండర్ ప్రకటన తేదీ 04-3-2024

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామపంచాయతీ లో కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై ఈ క్రింది పనులు నిర్వహించుటకు 1-04-2024 నుండి 31-03-2025 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. 16-03-2024 తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డ్ టెండర్లు స్వీకరించి అదే రోజు సాయంత్రం 5.00 గంటలకు హాజరైన టెండర్ల ద్వారా సమక్షంలో తెరవబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయం పని చేయు వేళల యందు గ్రామపంచాయతీ కార్యదర్శులు అడిగి తెలుసు కోగలరు.

వరుస క్రమం	పనివివరాలు	కాలపరిమితి	కావలసిన వ్యక్తులు	డిపాజిట్
1.	పారిశుధ్య నిర్వాహణకు స్వీపర్లు	01-04-2024 నుండి 31-03-2025	1	1,000/-
2.	మంచినీటి సరఫరా నిర్వాహణకు	01-04-2024 నుండి 31-03-2025	1	1,000/-
3.	వీధి దీపాల నిర్వాహణ ఎలక్ట్రీషియన్	01-04-2024 నుండి 31-03-2025	1	1,000/-

గమనిక : గతంలో అనుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. పంచాయితి నిధులు నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితి వారికి పూర్తి అధికారం కలదు.

సం// చావా దుర్గారాణి, సర్పంచ్, గ్రామ పంచాయతి, కన్నెవీడు
సం// యలమంచిలి పద్మ, పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయతి, కన్నెవీడు

జిల్లాస్థాయి స్పందనలో 108 అర్జీలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, డీఆర్వో వి. శ్రీనివాసరావు అర్జీదారులను స్వీకరించారు. వీటిలో వివిధ విభాగాలకు సంబంధించి రెవిన్యూ - 51, పోలీస్ -15, యంఏయుడి - 5, సర్వే అండ్ సెటిల్మెంట్ - 3, మార్కెటింగ్ - 4, కోపరేటివ్ - 1, డీఆర్డీఏ - 4, స్టాంప్స్ అండ్ రెజిస్ట్రేషన్స్ - 3, ఉపాధి కల్పన -1, ఆరోగ్య శాఖ - 2, అటవీ శాఖ - 3, విద్య - 4, విభిన్న ప్రతిభావంతులు - 2, ఆర్ అండ్ బి - 1, డ్వామా - 2, దేవాదాయ శాఖ - 1, పౌర సరఫరాలు - 3, బ్యాంకు రిలేటెడ్ - 3 అర్జీలున్నాయి. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజిని కుమారి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, కంకిపాడు

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 193/2024 తేది : 04-03-2024

కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, కంకిపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకు రేటు కాంట్రాక్టు పద్ధతిపై ది. 01-04-2024 నుండి ది. 31-03-2025 వరకు అనగా ఒక సంవత్సర కాలము పనిచేయుటకు వ్యక్తుల సేవలు నిమిత్తం సీల్డు టెండర్లు ఆహ్వానించటమైనది. ఆసక్తి గల వ్యక్తులు నుండి ది. 11-03-2024వ తేదీ మధ్యాహ్నం 3-00 గం.ల లోపు గ్రామపంచాయతీ కార్యదర్శి గారిచేగానీ, వారి అనుమతి పొందిన వారిచేగానీ టెండర్లు స్వీకరించబడి అదేరోజున మధ్యాహ్నం 3-00 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు దాఖలు చేయువారు ముందుగా దరఖాస్తు చేసుకొని ఈ కార్యాలయము నందు టెండరు షెడ్యూలు పొంది, నిర్ణీత ధరావత్తు సొమ్ము చెల్లించి, రశీదును టెండరు షెడ్యూలుకు జతపరిచి టెండరు దాఖలు చేయవలెను. టెండరు షరతులు మరియు ఇతర వివరములు గ్రామపంచాయతీ కార్యాలయ పనివేళల యందు పొందవచ్చును. ఏ విధమైన ముందస్తు నోటీసు లేకుండానే టెండర్లు వాయిదా వేయుటకు లేదా రద్దు పరచుటకు దిగువ సంతకందారు అధికారం కలిగియున్నారు.

షెడ్యూల్

కంకిపాడు గ్రామపంచాయతీ పరిధిలో 2024-25వ సంతవ్సరంనకు అనగా ది. 01-04-2024 నుండి ది. 31-03-2025 వరకు కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ తెలిపిన పనులకు వ్యక్తుల సేవల నిమిత్తం

వ.నెం.	పని వివరము	వ్యక్తుల సంఖ్య	ధరావత్తు మొత్తము
1.	స్వీపర్లు	37 మంది వ్యక్తులు	రూ.1000/-
2.	ఎలక్ట్రీషియన్	01 వ్యక్తి	రూ.1000/-
3.	ట్రాక్టర్ డ్రైవర్లు	03 గురు వ్యక్తులు	రూ.1000/-
4.	నీటి సరఫరా సిబ్బంది	05 గురు వ్యక్తులు	రూ.1000/-
	మొత్తము	46 మంది	

గమనిక : గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ట్రాక్టర్ డ్రైవర్లకు టి అండ్ టి లైసెన్స్ కలిగి వుండవలెను. గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి జీత భత్యములు ఇవ్వబడును. టెండర్లను స్వీకరించుటకు, నిరాకరించుటకు ఏ కారణం చేతనైనను టెండరు రద్దు చేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు. వ్యక్తిగత టెండర్లు మాత్రమే స్వీకరించబడును. ఏజెన్సీ ద్వారా స్వీకరించబడవు.

సం/- శ్రీమతి బాకి రమణ, సర్పంచ్, గ్రామపంచాయతీ, కంకిపాడు
సం/- ఓ.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, కంకిపాడు

బహిరంగ వేలం ప్రకటన
గ్రామపంచాయితీ కార్యాలయం - నాగాయలంక

నాగాయలంక మండలం, కృష్ణాజిల్లా

ఆర్.ఓ.సి.నెం. **04/2024** తేది: **04-03-2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం, నాగాయలంక గ్రామపంచాయితీ పరిధిలో ది. 2024-25 ఆర్థిక సంవత్సరమునకు ఈ దిగువ షెడ్యూలులో తెలుపబడిన వేలంపాటకు ది. 12-03-2024వ తేదీన మధ్యాహ్నం గం. 2.00 ని॥లకు పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయతీ సర్పంచ్ సమక్షంలో పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేదా వారి అనుమతి పొందినవారిచే గాని బహిరంగవేలంపాట జరుపబడును. వేలంపాటలో పాల్గొనదలచిన వారు పంచాయితీనకు ఏవిధమైన బకాయిలు ఉండరాదు మరియు గత ఆరు నెలల్లోపు తహసిల్దారు గారిచే పొందబడిన సాల్వెన్సు రూ: 5,00,000/- విలువ గలది డిపాజిట్‌తోపాటు పాటల సమయంలో కార్యదర్శికి ఇవ్వవలెను. మిగిలిన వివరాలు ఆఫీసు పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	మండలం పేరు	గ్రామ పంచాయతీ పేరు	ఐటమ్ వివరం	పాటకాలపరిమితి	ధరావత్తు
1.	నాగాయలంక	నాగాయలంక	రోజువారీ ఆశీలు	1.4..2024నుండి 31.3.2025వరకు	5,00,000/-
2.	నాగాయలంక	నాగాయలంక	వారపుసంత ఆశీలు	1.4.2024 నుండి 31.3.2025వరకు	5,00,000/-

గమనిక: 1.సదరు పాట పెరుగుతున్న యెడల అవసరమునుబట్టి పాట మధ్యలో కోరిన పిదప మరల డిపాజిట్ చెల్లించవలెను. 2.సదరుపాట అయిన వెంటనే హెచ్చుపాట దారుడు పాట సొమ్మును 24గంటల్లోపు చెల్లించవలయును.

సం/- కె.అంకాలు, సర్పంచ్, గ్రామ పంచాయతీ, నాగాయలంక
(సం॥) జె.హెచ్.వి.పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, నాగాయలంక

ధాన్యం డబ్బులివ్వండి మహాప్రభో

(మొదటి పేజీ తరువాయి)

చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

రబీ పంటల పెట్టుబడులకు అష్టకష్టాలు !

రబీలో సాగు చేసిన అపరాల తీత, నూర్పిడి పనులు మొదలయ్యాయి. ఒక్కో ఎకరాకు సగటున రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతోంది. పొలాల్లో పనులు చేసిన కార్మికులకు, యంత్రాలకు (హార్వెస్టింగ్ నిమిత్తం) రైతులు నూర్పిడి పూర్తయిన వెంటనే నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఖరీఫ్ ధాన్యం నగదు రాకపోవడంతో డబ్బులకు రైతులు తీవ్ర అవస్తలు పడుతున్నారు. రైతువారీగా అప్పు దొరక్క అధిక వడ్డీలకు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. నెలకు నూటికి రూ.3 నుంచి రూ.5 వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన నగదు వెంటనే ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, కె.తాడేపల్లి

విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్‌జిల్లా.

టెండరు ప్రకటన తేది : **02-03-2024**

ఎన్‌టిఆర్‌జిల్లా, విజయవాడ రూరల్ మండలం, కె.తాడేపల్లి గ్రామపంచాయతీ నందు ఈ దిగువ ఉదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సం॥నకు అనగా ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు సీల్డు టెండర్లు గ్రామపంచాయతీ కార్యాలయము నందు ది. 11-3-2024 ఉదయం 11 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 3.00 గం.లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచేగానీ, వారి అనుమతి పొందిన వారిచేగానీ సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనిపేరు	వ్యక్తుల సంఖ్య	టెండరు ధరావత్తు మొత్తం
1.	స్వీపర్లు	8	రూ.3000/-
2.	ఎలక్ట్రీషియన్	2	
3.	ట్రాక్టర్ డ్రైవర్	1	
4.	ట్యాంక్ ఆపరేటర్స్	3	
5.	కంప్యూటర్ ఆపరేటర్	1	

నోట్ :- గతంలో చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ట్రాక్టర డ్రైవర్లకు టి అండ్ టి లైసెన్సు కలిగి యుండవలెను. గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి జీతం ఇవ్వబడును. టెండర్లను స్వీకరించుట, నిరాకరించుటకు ఏ కారణం చేతనైనను టెండరు రద్దు చేయుటకు పంచాయతీ సెక్రటరీ గారికి అధికారము కలదు. వ్యక్తిగత టెండర్లు మాత్రమే స్వీకరించబడును. ఏజెన్సీ ద్వారా స్వీకరించబడదు.

సం/- వి.గోపాలరావు, సర్పంచ్, గ్రామపంచాయతీ, కె.తాడేపల్లి
సం/-కె.మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, కె.తాడేపల్లి.

మహారాజశ్రీ 15వ అదనపు జిల్లా జడ్జి, కృష్ణా, నూజివీడు వారి కోర్టులో

ఎఆర్‌బి.ఓ.పి. నెం. 57/2021

బిట్వీన్:
పాండురంగారావు ఈడె ...అప్లికెంట్
మరియు
M/s. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, గుడివాడ, రి॥బై సీనియర్ మేనేజర్ మరియు ఇతరులు ...క్లైమెంట్/ రెస్పాండెంట్స్

టూ: 2వ రెస్పాండెంట్:
శ్రీ కిషోర్‌కుమార్ కొమరవరపు, తండ్రి: కోటేశ్వరరావు, డోరు నెం. 4-16, పెంజంద్ర గ్రామం (పోస్ట్), గుడ్లవల్లేరు మండలం, కృష్ణా జిల్లా.

పై నెంబరు ఓ.పిలో పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినన్నూ పుచ్చుకొనక ఎవేడ్ చేస్తున్నారు. పై నెంబరు ఓ.పిలో మీరు హాజరగు నిమిత్తం **ది. 19-03-2024వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ తరపు వకీల్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు పై కోర్టు వారిచే ఓ.పి. తీర్మానించబడును.

బోగోలు చంద్రశేఖరరావు
నూజివీడు అడ్వకేట్, నూజివీడు
ది.04-03-2024 సెల్: 9182238726

మహారాజశ్రీ 15వ అదనపు జిల్లా జడ్జి, కృష్ణా, నూజివీడు వారి కోర్టులో

ఎఆర్‌బి.ఓ.పి. నెం. 58/2021

బిట్వీన్:
పాండురంగారావు ఈడె ...అప్లికెంట్
మరియు
M/s. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, గుడివాడ, రి॥బై సీనియర్ మేనేజర్ మరియు ఇతరులు ...క్లైమెంట్/ రెస్పాండెంట్స్

టూ: 2వ రెస్పాండెంట్:
శ్రీ కిషోర్‌కుమార్ కొమరవరపు, తండ్రి: కోటేశ్వరరావు, డోరు నెం. 4-16, పెంజంద్ర గ్రామం (పోస్ట్), గుడ్లవల్లేరు మండలం, కృష్ణా జిల్లా.

పై నెంబరు ఓ.పి.లో పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినన్నూ పుచ్చుకొనక ఎవేడ్ చేస్తున్నారు. పై నెంబరు ఓ.పిలో మీరు హాజరగు నిమిత్తం **ది. 19-03-2024వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ తరపు వకీల్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు పై కోర్టు వారిచే ఓ.పి. తీర్మానించబడును.

బోగోలు చంద్రశేఖరరావు
నూజివీడు అడ్వకేట్, నూజివీడు
ది.04-03-2024 సెల్: 9182238726

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పెడన : గత పది ఏళ్లుగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వీటిని కల్పిస్తామని నమ్మకమైన హామీ ఇస్తేనే ఓట్లు వేస్తామని ఆయా గ్రామాల ప్రజలు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాముతో అన్నారు. సోమవారం మండల పరిధిలోని సింగరాయపాలెం, కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, కట్లపల్లి, తెలుగు పాలెం గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికతో కలిసి ప్రజా దీవెన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సమస్యలు రాము ముందు ప్రజలు ఏకరువు పెట్టారు. గత పదేళ్లుగా ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు లేవని, త్రాగునీరు ట్యాంకర్ రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయని, అలాగే డ్రైనేజీ లేక వర్షాకాలంలో నీరు ఇళ్లల్లోకి చేరుతుందని, అంతేకాకుండా విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో పాములు సంచరిస్తున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. పలు సమావేశాల్లో నాయకులకు, అధికారులకు విన్నవించిన ఏళ్ల తరబడి తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి స్పష్టమైన హామీ ఇస్తేనే ఓట్లు వేస్తామని ప్రతి ఇంట్లోని మహిళలు చెప్పారు. దీనిపై రాము స్పందిస్తూ ప్రస్తుతానికి ప్రధాన రహదారులు మాత్రమే జిల్లా పరిషత్ నిధుల నుంచి వేస్తామని, గెలిపించిన వెంటనే అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, ప్రతి ఇంటికి మంచినీటి పైపులైను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జున రావు, మండల పరిషత్ అధ్యక్షులు రాజులపాటి వాణి, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండవీటి నాగబాబు, సర్పంచులు గరికపాటి రామానాయుడు, దావు భైరవలింగం, పట్టణ ప్రధాన కార్యదర్శి వీరం రాము తదితరులు పాల్గొన్నారు.

ఖద్దరు గాంధీ కృష్ణమూర్తి అస్తమయం

ప్రజాశక్తి-మోపిదేవి : ఖద్దరు గాంధీగా జాతీయ గుర్తింపు కలిగిన కోసూరు గోపాల కృష్ణమూర్తి సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి తన స్వగ్రామం మోపిదేవి మండలం కోసూరు వారిపాలెంలో తుదిశ్వాస విడిచారు. దివిసీమ ఖాదీ సర్వోదయ సహాయ సమితి కార్యదర్శిగా ఖాదీ అభివృద్ధికి కృషి చేశారు. ఖాదీ రంగానికి యాభై ఏళ్ళు సేవలు చేసి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించారు. ఖాదీ వస్త్రాలను ఉన్నత స్థానానికి తీసుకొని వెళ్లారు. గతంలో ఏపీ గవర్నర్ కుముద్ బెన్ జోషి ఖాదీ సదస్సులకు కష్ణాజిల్లాలో పర్యటించినపుడు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానం పొంది, కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు. దివిసీమ గాంధీ మండలి వెంకట కష్టారావుతో కలిసి ఖాదీ అభివృద్ధికి కషి చేశారు. మండలి బుద్ధప్రసాద్ కూడా ఆయనకు సన్నిహితులు. కాగా కోసూరు గోపాల కష్ణమూర్తి భార్య ఐదేళ్ల క్రితం మతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రాయితీలు కొనసాగించాలనడం అభినందనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దేశంలో మత్స్య పరిశ్రమ ప్రగతికి మత్స్యకారుల సంక్షేమానికి సబ్సిడీలు, రాయితీలు మరో 25 ఏళ్ళ కొనసాగించాలని పిపిస్నాన్ రాష్ట్ర డైరెక్టర్ అర్జిలి దాస్ డిమాండ్ చేయడం పట్ల మత్స్యకార సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నాగాయలంకలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ డబ్ల్యుటిఓ సదస్సులో ఏపీ మత్స్యకారుల సంఘాల ప్రతినిధి అర్జిలిదాస్ పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గత నెల 26,27,28,29, లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశ రాజధాని అబుదాబిలో ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్లో మత్స్యకారులకు ఇస్తున్న సబ్సిడీలు రాయితీలు తగ్గించాలని తీర్మానానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న అర్జీ లి దాస్ మాట్లాడడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో మత్స్యకారుల సంక్షేమానికి రాయితీలు సబ్సిడీలు 25 ఏళ్ల కొనసాగించాలని, మత్స్యకారుల వాడిని అర్జీ లి దాస్ బలంగా వినిపించారన్నారు. ఈ సమావేశంలో నాగాయలంక ఎంపీటీసీ లంకే శ్రీనివాస ప్రసాద్ మత్స్యకార సంఘాల నాయకులు నాగిడి తాతారావు నాగిడి ఆదిలక్ష్మి అంగ్రాజు ఆదినారాయణ వాటి పల్లి బిక్షం తదితరులు పాల్గొన్నారు

నిబద్ధతగల నాయకురాలు ఆలపాటి మాచమ్మ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: సహకార సంఘాల ద్వారా మాత్రమే పాడిరైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని నమ్మి రంగన్నగూడెంలో పాల ఉత్పత్తిదారుల సహకారసంఘాన్ని స్థాపించడంతో పాటు గ్రామ సర్పంచ్‌గా 1960లోనే గ్రామాభివృద్ధికి నిబద్ధతతో కషి చేసిన నాయకురాలు అలపాటి మాచమ్మ అని రాష్ట్ర రైతు సంఘాల సమన్వయసమితి నాయకుడు వై.కేశవరావు కొనియాడారు. బాపులపాడు మండలం రంగన్న గూడెంలో ఇటీవల మరణించిన కమ్యూనిస్ట్ నాయకు రాలు, మాజీ సర్పంచ్ అలపాటి మాచమ్మ సంతాపసభను సోమవారం ఆళ్ల గోపాలకష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రైతు సంఘాల నాయకులు, కమ్యూనిస్ట్ నేతలు మాచమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుమారుడు శ్రీనివాస రావుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1960దశకంలోనే పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పడటానికి కషి చేసిన మాచమ్మ సర్పంచ్ గ్రామాభివృద్ధికి కషి చేసారన్నారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం వితరణ ఇవ్వడంతో పాటు అప్పటి సీపీఐ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణం ద్వారా నిధుల మంజూరులో కీలకపాత్ర పోషించారన్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో భర్తను కోల్పోయినా తట్టుకుని వామపక్షాల ఉద్యమానికి మద్దతుగా నిలచారని కేశవరావు అన్నారు.సర్పంచ్ కసుకుర్తి రంగా మణి,ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా నాయకుడు బేతా శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, ఏలూరు జిల్లా రైతు సంఘం నాయకుడు పాతూరి రవి, గంటా పాపారావు, టీడీపీ నియోజకవర్గ ప్రతినిధి యార్లగడ్డ సతీష్, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు అవిర్నేని శేషగిరిరావు. తోట సాంబశివరావు. స్థానిక ప్రముఖులు, మాజీ సర్పంచ్లు పాల్గొని అలపాటి మాచమ్మకు నివాళులర్పించారు.

మాచమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బరియల్ గ్రౌండ్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 7 వ డివిజన్లో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌ను మచిలీపట్నం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ పేర్ని కష్ణ మూర్తి(కిట్టు)సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మడపాటి విజయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడెల్లి డేవిడ్,7 వ డివిజన్ కార్పొరేటర్ పడమట రేవతి,కార్పొరేటర్లు,కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద నిరసన

ప్రజాశక్తి-గుడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డ్రైనేజీ శిలాఫలకం వద్ద సోమ వారం తెలుగుదేశం పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి మాట్లాడుతూ 2019 సంవత్సరం డిసెంబర్‌లో ఎమ్మెల్యేగా ఉన్న జోగి రమేష్ గూడూరు గ్రామానికి 8 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి, కోటి 50 లక్షలు రూపాయలతో రోడ్ల నిర్మాణానికి మొత్తం 9 కోట్ల 66 లక్షల రూపాయల పనులకు గూడూరు గాంధీ బొమ్మ సెంటర్లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారని, కానీ నేటికీ పనులు ప్రారంభంకాలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్‌ఏ బేగ్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొరి పర్తి ఫణి రాజు, వార్డు సభ్యులు డొక్కు నాగరాజు, యర ప్రసాద్, పార్టీ నాయకులు బేతల స్వామి, పోతన రంగ పాల్గొన్నారు.

వర్ల రామయ్యకు పరామర్శ

ప్రజాశక్తి-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఇటీవల అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పెదపారుపూడి గ్రామంకు చెందిన టిడిపి మహిళా మండల కోశాధికారి నల్లవాణి విజయవాడలో తన గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న వర్ల రామయ్యని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు బోడగం విమల కష్ణ పుట్టిన రోజు సందర్భంగా జనసేన పార్టీకి పది వేల రూపాయలు విరాళం సోమవారం అందజేశారు. కేక్ కటింగ్ లాంటి హంగులు ఆర్భాటాలు కాకుండా జనసేన పార్టీ కి విరాళం అందచేయటంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుడివాడలో మహిళా గళం సదస్సు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలో కృష్ణా జిల్లా తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహిళాగళం సదస్సు బంటుమిల్లి రోడ్డులోని తాళ్లూరి కళ్యాణమండపంలో జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ సదస్సులో టిడిపి అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణ రావు, గుడివాడ టీడీపీ ఇంచార్జ్, నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత, టీడీపీ మహిళా నేతలు టీడీపీ నేతలు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పామర్రు టిడిపి అభ్యర్థి వర్ల కుమార్ రాజా, టిడిపి అంగన్వాడి ద్వాక్రా విభాగాల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, తెలుగు మహిళ నాయకులు పొదిలి లలిత, మైనేని ఇందిరా, మూల్పూరి కళ్యాణి, షేక్ ఆషా, చక్రాల ఉష పాల్గొన్నారు.

బాతుల్లంక రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : నాగాయతిప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని బాతుల్లంక రోడ్డు నిర్మాణపు పనులను పంచాయతీ సర్పంచి గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) ప్రారంభించారు. పొదిగానిలంక సమీపంలో ఆర్.సి కరకట్ట నుంచి పంట పొలాలలోకి వెళ్లే బాతుల్లంక రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం ఉదయం రైతులతో కలిసి సర్పంచ్ వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆర్.సి కరకట్ట నుంచి ఒక కిలోమీటర్ మేర రూ. 10 లక్షలు జిల్లా పరిషత్తు నిధులు, రూ. 6 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో మొత్తం రూ. 16 లక్షలతో రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పిఎసిఎస్ చైర్ పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, పాలకేంద్రం అధ్యక్షులు పుప్పాల సతీష్ బాబు (నాని), కౌలు రైతు పరిశే వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రానున్న ఎన్నికలను దష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను నియోజకవర్గ పరిధిలో అన్ని చర్యలు చేపట్టినట్లు గన్నవరం డిఎస్పి జయసూర్య వెల్లడించారు. ఎన్నికల నేపధ్యంలో కేంద్రం నుంచి నియోజకవర్గానికి కేంద్రం కేటాయించిన పారా మిలిటరీ బలగాలతో మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో సోమవారం కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు బాపులపాడు గ్రామంలోని ఇందిరానగర్, హనుమాన్ జంక్షన్ కూడలి మీదుగా జంక్షన్ పోలీస్ స్టేషన్ కు చేరింది. ఈ కార్యక్రమంలో గన్నవరం డిఎస్పి జయసూర్య, హనుమాన్ జంక్షన్ సిఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, వీరవల్లి, హనుమాన్ జంక్షన్ ఎస్సైలు చిరంజీవి, జనార్దన్, ట్రైనీ డిఎస్పి వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణిలతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పామర్రు పర్యటనకు వచ్చిన సందర్భంగా 33 మంది తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకుంటూ అర్జీలు అందజేశారని వాటిని శుక్రవారం లోగా పరిష్కారానికి కషి చేయాలన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ ప్రజల విజ్ఞప్తులను ఎంతో ఓపిగ్గా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించడంతో పాటు మండలాల్లో తహసీల్దారులతో, రెవెన్యూ డివిజనల్ అధికారులతో కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వారి సమస్యలను నిర్ణీత గడువులోగా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మొత్తం 135 అర్జీలు స్వీకరించినట్లు కలక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఎ వీడి పిఎస్‌ఆర్ ప్రసాద్, డి.ఎస్.ఓ పార్వతి, ఐ సి డిఎస్ పి డి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, డీఈవో తాహెరా సుల్తానా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి షంసున్నీసా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ వెంకటరమణ, డిపిఒ నాగేశ్వర్ నాయక్, డిఎంహెచ్ ఓ డాక్టర్ గీతా బాయి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం వైసిపిలో విభేదాలు

సీనియర్ నేతల రహస్య సమావేశం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : అధికారపార్టీలో నివురు గప్పిన నిప్పులా ఉన్న విభేదాలు తారా స్థాయికి చేరాయి. మండలంలో వైసిపిని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు లోపాయికారి ఒప్పందాలు, అవకాశవాద రాజకీయం చేస్తున్నారని, వారితో తాడోపేడో తేల్చుకుంటామని ఆ పార్టీకి చెందిన కొందరు మండల నేతలు ఆదివారం రాత్రి రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. తన స్వార్ధ ప్రయోజనాల కోసం టిడిపిలో చేరిన ఎంఎల్‌ఎ వసంతతో టచ్‌లో ఉన్న వారికి, పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూసే వారికి తగిన గుణపాఠం చెబుతామని ఆ పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు ఆదివారం రాత్రి సమావేశమయ్యారు. ఎంఎల్‌ఎ వసంతతో కలిసి టిడిపిలో చేరాలని ఆహ్వానించిన వ్యక్తిని మళ్లీ సొసైటీ అధ్యక్షుడిగా ఎలా రెన్యువల్ చేస్తారని, పార్టీలో కోవర్టులు ఉన్నా పట్టించుకోరా ? అంటూ అధిష్టానం వద్దకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఎంపిపి రామినేని వీరస్వామి నాయుడు ప్రవణ్య, వైసిపి సీనియర్ నాయకులు కొప్పి రెడ్డి వెంకట్ రెడ్డి నేతత్వంలో సమావేశం జరిగినట్లు సమాచారం. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మండలంలో చక్రం తిప్పిన ఆ పార్టీ నేత... వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఎల్‌ఎ వసంత సమక్షంలో వైసిపిలో చేరారని, ఇప్పుడు వసంత పార్టీ మారుతుంటే అదే నేత అందరినీ టిడిపిలోకి రావాలని ఆహ్వానించారని, అటువంటి నేతను మండల ఆత్మీయ సమావేశంలో వేదికపై కూర్చోబెట్టడం ఏంటని, మళ్లీ అదే నేతను సొసైటీ అధ్యక్షుడిగా రెన్యువల్ చేయటానికి ఎంపి కేశినేని నాని ఎలా సిఫార్సు చేస్తారని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మండలంలో సీనియర్ నేతనని చెప్పుకొని తిరుగుతున్న ఒక ప్రజాప్రతినిధి ఒంటెద్దు పొడకలతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వైసిపి మైలవరం ఇన్చార్జిగా నియమితుడైన తిరుపతిరావు పార్టీలో జరుగుతున్న పరిణామాలను సరిదిద్దడంలేదని ఆగ్రహిస్తూ ఇక తాడోపేడో తేల్చుకోవాలని సదరు నేతలు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మండలంలో వైసిపి నేతల తలోదారి చూసుకోవటం తప్ప మరోమార్గంలేదని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. తిరుపతిరావు దీనిపై సమగ్ర సమాచారం తెప్పించుకొని పరిస్థితిని చక్కదిద్దకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని వైసిపి నేతలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

సమావేశంలో పాల్గొన్న వైసిపి నేతలు

ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ మురళీ

యూనియన్ బ్యాంకు మెగా రిటైల్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో సోమవారం పోరంకిలోని ద్వారకా రెసిడెన్సీలో మెగా రిటైల్ ఎక్స్‌పో-2024ను ప్రారంభించినట్లు బ్యాంకు డిప్యూటీ జోనల్ హెడ్ మురళీ పార్ధసారధి తెలిపారు. ఈ ఎక్స్‌పోలో లోకల్ బిల్డర్స్, కార్ డీలర్స్, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్, విజయవాడ లోకల్ బ్రాంచి మేనేజర్స్, రీజనల్ ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు. మెగా ఎక్స్‌పో ద్వారా యూనియన్ బ్యాంకు అభివృద్ధికి సహాయం చేసిన బిల్డర్లు, డీలర్స్‌కు, ముఖ్య ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు రీజనల్ హెడ్ వెంకటరావు మాట్లాడుతూ గృహ రుణాలు, వాహన ఋణాలు, అతి తక్కువ వడ్డీతో అతి త్వరగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనల్ హెడ్ శారద మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ డిసిపికి 101 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: రూరల్ డిసిపి కంచి శ్రీనివాసరావు స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బాధితులు

నుండి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించారు. విజ్ఞప్తులకు సంబంధించి నేరుగా భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వార సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 20 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 26 ఫిర్యాదులు, సివిల్ వివాదాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు, వివిధ మోసాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు, వివాదాలకు సంబందించి 02 ఫిర్యాదులు, ఇంటి అద్దెకు సంబంధించినవి 1 ఫిర్యాదు, సైబర్ క్రైమ్ నేరాలకు సంబంధించినవి 3 ఫిర్యాదులు మరియు ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలుకు, సంఘటనలకు సంబంధించినవి 23 ఫిర్యాదులు మొత్తం 101 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

కాల పరిమితి సర్క్యులర్‌పై విఓఎల వినతి

ప్రజాశక్తి-విజయవాడ: విఓఎల ఉపాధి దెబ్బతీసే మూడు సంవత్సరాల కాలపరిమిత సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, గ్రామ సమైక్యల మెర్జీని ఆపాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు ఎపి విఓఎల ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ సంఘాలను విడగొట్టడం కలపడం వంటి పనులు అధికారులే చేశారన్నారు. విఓఎలను మెర్జ్ చేయడం వల్ల వేలాది మంది విఓఎలకు ఉపాధి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, అధ్యక్షురాలు చాంద్ బేగం, నాగలక్ష్మి, రజనీకుమారి, జ్యోతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న విఓఎలు

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలోని మచిలీపట్నం చిలకలపూడి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం మైనార్టీ బాలురకు సంబంధించి రూపొందించిన కరపత్రాన్ని, గోడపత్రికను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మచిలీపట్నంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఏపీఆర్ఐ సొసైటీ గుంటూరు వారి ఆధ్వర్యంలో మైనారిటీల కోసం మచిలీపట్నం గురుకుల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని ఇందులో 85 శాతం సీట్లు ముస్లిం మైనార్టీలకు, బీసీసీలకు, 15 శాతం సీట్లు ఎస్సీ ఎస్టీలకు కేటాయించామన్నారు. అందరికీ ఇంగ్లీష్ మీడియంలో విద్యా, భోజన వసతి సదుపాయాలు పూర్తిగా ఉచితమని, ప్రభుత్వ పథకాలు ఆ పాఠశాలలోని విద్యార్థులకు వర్తిస్తాయన్నారు. 5, 6, 7, 8 తరగతిలో చేరదలచిన ముస్లిం మైనార్టీ విద్యార్థులు, బీసీ-సీ విద్యార్థులు నేరుగా చేరవచ్చన్నారు. వారికి ఎటువంటి ప్రవేశ పరీక్షలే దన్నారు. ఇతరులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో జరుగుతుందన్నారు. ఆన్లైన్లో పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకొనుటకు గడువు ఉందన్నారు. జిల్లాలోని ముస్లిం, బిసి మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

నిమ్రా విద్యాసంస్థల్లో విద్యార్థులకు భవిష్యత్తులో స్థిరపడటానికి ఉద్యోగాలలో విజయం సాధించుటకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో హెచ్ఆర్డి కన్సల్టెంట్ డాక్టర్ ఖాసిఫ్ రజా ఖాన్ మరియు ఎం కె ఎమ్ కే ఎస్ మొహియుద్దిన్ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్వ్యూ నుండి ఉద్యోగంలో విజయం సాధించేవరకు ఒక చక్కని ప్రణాళిక ద్వారా మాత్రమే సాధ్యమని తెలిపారు. భవిష్యత్తు కొరకు విద్యార్థి దశ నుండే కసరత్తు ప్రారంభించాలని, సరైన మార్గంలో పయనించి విజయా తీరాలను అందుకోవాలని, అందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విపులంగా వివరించారు.అనంతరం నిమ్రా విద్య సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైన నారాయణమూర్తి అతిధులను మేమెంటో మరియు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్రా విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ డాక్టర్ అక్బర్ ఖాన్, డాక్టర్ జనార్ధన్, ప్రొఫెసర్ రాజేశ్వరి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్‌జి మోటార్స్ కార్లు విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎమ్‌జి మోటార్స్ ఆధ్వర్యంలో సరికొత్త హెక్టార్ వేరియంట్ కార్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు

ఎమ్‌జి మోటార్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా తెలిపారు. ఎమ్‌జి మోటార్స్‌లో నూతన కార్ల పరిచయ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షైన్ ప్రో, సెలక్ట్ ప్రో అనే రెండు కొత్త కార్లను తీసుకువచ్చామని ఇవి భద్రత డ్రైవింగ్ సౌలభ్యంతో పాటు అనేక సరికొత్త ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఎం.జి.సెక్టార్ రూ.13.99 లక్షల ఎక్స్‌షోరూమ్ ధర నిర్ణయించినట్లు తెలిపారు.

శాంసంగ్ గెలాక్సీ ఎఫ్15 ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ గెలాక్సీ ఎఫ్15ను సరికొత్త టెక్నాలజీతో తీసుకువచ్చినట్లు శాంసంగ్ షోరూమ్ ప్రతినిధి ఎం.ఎస్.రాజు తెలిపారు. నగరంలోని శాంసంగ్ షోరూమ్‌లో నూతన స్మార్ట్‌ఫోన్ బుకింగ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వినియోగదారులకు దాని ముందు తరపు ఫోన్లతో పోలిస్తే ప్రత్యేకంగా ఉండటంతో పాటుగా తమ సెగ్మెంట్‌కు మాత్రమే పరిమితమైన అనేక ఫీచర్లతో అత్యుత్తమ స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. గెలాక్సీ ఎఫ్ 15 5జీ తమ విభాగంలో అత్యుత్తమమైన 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఇతర ఫీచ్లతో ఎస్ అమెలెడ్ డిస్‌ప్లే, నాలుగు తరాల ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్, ఐదేళ్ల సెక్యూరిటీఅ ప్డేట్‌తో పాటు ఎన్నో అద్భుతమైన ఫీచర్లు ఉన్నాయని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-సింగ్‌నగర్: వాంబే కాలనీలోని విఎంసి కల్యాణ మండపంలో సోమవారం ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ 31 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శైలజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 15 డివిజన్ రామలింగేశ్వర నగర్‌లోని 68, 69, 70, 71, 72 సచివాలయాలకు సంబంధించిన 400 మంది లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ మేయర్ ఆళ్ల చల్లారావు అందచేశారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-గుడివాడ : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కేంద్ర బలగాలతో చక్కటి పరిస్థితులను కల్పిస్తామని గుడివాడ డిఎస్పీ పి శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. డి.ఎస్.పి శ్రీకాంత్ పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో పోలీస్ అధికారులతో కలిసి కేంద్రబలగాలు కవాతు చేపట్టాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కేంద్ర బలగాలు ప్రవేశించినట్లు గుడివాడ డిఎస్పి శ్రీకాంత్ తెలియజేశారు. గుడివాడ సబ్ డివిజన్ కు సిఐఎస్ఎఫ్ 287 విభాగానికి చెందిన 92 మందిని కేటాయించారని డిఎస్పి తెలియచేశారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తారని ఆయన అన్నారు.

ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితిలను కేంద్ర బలగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని డిఎస్పీ శ్రీకాంత్ అన్నారు. కవాతులో సీఐలు శ్రీనివాసరావు, దుర్గారావు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.